నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
3 | ఖమ్మం, శనివారం 6 ఏప్రిల్ 2024 | BHADRADRI KOTHAGUDEM

రామయ్య సేవలో హైకోర్టు జడ్జి దంపతులు

స్వామివారిని దర్శించుకుంటున్న హైకోర్టు జడ్జి మాధవీదేవి

భద్రాచలం/పర్ణశాల, ఏప్రిల్ 5 : భద్రాచలం సీతారామచంద్రస్వామివారిని శుక్రవారం రాష్ట్ర హైకోర్టు జడ్జి టీ మాధవి దేవి దంపతులు దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆమెకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా ధ్వజస్థంభం వద్ద నమస్కరించుకొని అంతరాలయంలోని మూలవరుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాలను సందర్శించి, తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు వారికి అమ్మవారి సన్నిధిలో వేదాశీర్వచనం అందజేసి, స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. అలాగే పర్ణశాల రామున్ని దర్శించుకున్నారు. అనంతరం పంచవటి, నారచీరెల ప్రాంతాన్ని సందర్శించి ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ ఎల్ రమాదేవి, జడ్జి కుటుంబ సభ్యులు, పట్టణ సీఐ, దుమ్ముగూడెం సీఐ అశోక్, ఎస్సై కేశవ్, ఆలయ అధికారులు, సీసీ అనీల్ ఉన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి


జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీలు, ఎమ్మెల్సీ తదితరులు

ఖమ్మం, ఏప్రిల్ 5 : సమాజంలో అణగారినవర్గాల సంక్షేమం కోసం అలుపెరుగని కృషిచేసిన సంఘసంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఆధ్వర్యంలో ఖమ్మంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నివాళి అర్పించిన వారిలో బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ విత్తనాభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, రఘునాథపాలెం మండలం అధ్యక్షుడు వీరూనాయక్, నాయకులు తాళ్లూరి జీవన్‌కుమార్, శీలంశెట్టి వీరభద్రం, మోతారపు శ్రావణి, పొన్నం వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ దండ జ్యోతిరెడ్డి అయ్యప్పరెడ్డి తదితరులు ఉన్నారు.

అమ్మాయిలను పుట్టనిద్దాం

- జిల్లాలో ఏటా తగ్గిపోతున్న బాలికల జనన నిష్పత్తి
- 1,000 మంది బాలురకు 919 మందే బాలికలు
- గణనీయ తగ్గుదలకు బ్రూణ హత్యలే కారణమా?
- ఇప్పటికీ మేల్కొనకపోతే భవిష్యత్ అంధకారమే..
- కఠిన చట్టాలు, సామాజిక చైతన్యమే పరిష్కారం

ఖమ్మం సిటీ, ఏప్రిల్ 5 : 'ఇంట్లో పాపాయి పుడితే మహాలక్ష్మి'గా భావించారు నాటి తరం పెద్దలు. కానీ నేటి తరం మనుషులు మాత్రం.. పుట్టింది ఆడ పిల్ల అని తెలిస్తే చాలు.. ఒక్కసారిగా ముఖం చాటేస్తున్నారు. ఆధునిక మానవులు ఇంకో అడుగు ముందుకేసి అందుబాటులోని సాంకేతికతను ఉపయోగించుకుని తల్లి గర్భంలో పసి గుడ్డుగా ఉన్నప్పుడే పిసికేస్తున్నారు. కనీస కనికరం చూపకుండానే రూపమే దాల్చని చిన్నారి ఆయువును అంతం చేస్తున్నారు. మగ బిడ్డే అసలైన వారసుడని, అతడు తల కొరివి పెడితేనే పున్నామ నరకం నుంచి విముక్తి ప్రాప్తిస్తుందని ప్రబలంగా నమ్ముతున్నారు. ఇలాంటి సామాజిక దురాచారాలే పాపాయిలకు శాపంగా మారుతున్నాయి. అందుకేనేమో.. మానవ వికాసానికి మూలమైన మహిళలు పుట్టకలోనూ వెనుకబడ్డారు. ఖమ్మం జిల్లా అధికార యంత్రాంగం సేకరించిన జనన వివరాలను పరిశీలిస్తే ఆడ బిడ్డల పుట్టుక ఎంతటి వివక్షకు గురవుతున్నదో ఇట్టే అర్థమవుతోంది.

జననాల్లో భారీ వ్యత్యాసం..

జిల్లాలో ఆడ పిల్లల పుట్టుక గణాంకాల్లో భారీ వ్యత్యాసం ఉంటోంది. మారిన పరిస్థితుల కారణంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు ప్రసవాల కోసం ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానాలను ఆశ్రయిస్తున్నారు. వాటిల్లో జరుగుతున్న ప్రసవాల లెక్కలను గమనిస్తే ఆడ శిశువుల కంటే మగ శిశువుల సంఖ్యే అధికంగా ఉంటోంది. గడిచిన నాలుగేళ్లలో (2020- 2023 వరకు) సర్కారు దవాఖానాల్లో మొత్తం 15,784 మంది బాలురు జన్మిస్తే.. 14,816 మంది బాలికలు జన్మించారు. అదేవిధంగా ప్రైవేట్‌లో 18,580 మంది మగ శిశువులు జన్మిస్తే.. 16,750 మంది ఆడ శిశువులు జన్మించారు. రెండింటినీ కలిపి చూస్తే వెయ్యి మంది మగ శిశువులకు కేవలం 919 మంది మాత్రమే ఆడ శిశువులు జన్మిస్తున్నారు. అయితే, ఆడ శిశువుల జనన నిష్పత్తి ప్రభుత్వాసుపత్రుల కంటే ప్రైవేట్‌లో తక్కువగా ఉండడం గమనార్హం. అధికారిక లెక్కల ప్రకారమే సర్కారులో ప్రతి వెయ్యి మంది బాలురకు 939 మంది బాలికలు ఉంటున్నారు. కానీ ప్రైవేట్‌లో మాత్రం ప్రతి వెయ్యిమంది బాలరకు 902 మంది మాత్రమే బాలికలు నమోదవుతున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో అనేక అంతరాలు తలెత్తే ప్రమాదం లేకపోలేదని సామాజిక వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బ్రూణ హత్యలే కారణమా?

సమాజంలో మగ బిడ్డలకు ఇస్తున్న విలువ ఆడపిల్లలకు లభించడం లేదన్నది జగమెరిగిన సత్యం. నిరుపేదలు సైతం వారసుడి కోసమే పరుగులు పెడుతున్నరు తప్ప.. పుట్టింది తమ ఇంటి మహాలక్ష్మి అనే ఆలోచించడం లేదు. అయితే, జిల్లాలో ఆడ పిల్లల పుట్టుక శాతం తగ్గడంలో బ్రూణ హత్యలు కూడా ఓ కారణమనే విషయాన్ని ఇటీవల వెలుగుచూసిన ఘటనలు రుజువు చేస్తున్నాయి. తల్లిదండ్రుల్లో సామాజిక చైతన్యం లోపించడం, వైద్యులు, ఆసుపత్రుల యాజమాన్యాల కాసుల కక్కుర్తితో గర్భస్థ పిండాలను కడతేర్చేడం వంటివి మూలాలుగా కన్పిస్తున్నాయి.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆడ, మగ శిశువుల జనన వివరాలు..

సంవత్సరం	మగ శిశువులు	ఆడ శిశువులు	సగటు
2020	3,534	3,308	936
2021	3,850	3,477	903
2022	4,350	4,180	961
2023	4,050	3,851	951
మొత్తం	15,784	14,816	939

ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆడ, మగ శిశువుల జనన వివరాలు

సంవత్సరం	మగ శిశువులు	ఆడ శిశువులు	సగటు
2020	5,001	4,412	882
2021	4,730	4,374	925
2022	4,534	4,159	917
2023	4,315	3,805	882
మొత్తం	18,580	16,750	902

కఠిన చట్టాలే పరిష్కారం..

బ్రూణ హత్యలు కొనసాగి.. ఆడ బిడ్డల పుట్టుక తగ్గిపోతుంటే జనాభాలో తీవ్ర సంక్షోభం ఏర్పడుతుంది. భవిష్యత్తులో లైంగిక వేధింపులు పెరిగి సాంఘిక విలువలు క్షీణించి పోతాయని సీనియర్ వైద్యులు, సామాజిక వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగంతోపాటు యావత్ సమాజం మేల్కోవాలని అంటున్నారు. ప్రజల్లో సామాజిక చైతన్యం రావాలని, కఠిన చట్టాలను అమలు చేయాలని వ్యాఖ్యానిస్తున్నారు.

నవమి వేడుకల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

- భక్తులు అధిక సంఖ్యలో తరలిరండి
- 2.5లక్షల లడ్డూ ప్రసాదం, 5లక్షల తలంబ్రాల ప్యాకెట్లు సిద్ధం
- దేవస్థానం ఈవో రమాదేవి

విలేకరులతో మాట్లాడుతున్న దేవస్థానం ఈవో రమాదేవి

భద్రాచలం, ఏప్రిల్ 5 : ఏప్రిల్ 17న నిర్వహించే శ్రీరామ నవమి, 18న జరిపే పట్టాభిషేకానికి వచ్చే భక్తుల కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను జయప్రదం చేయాలని దేవస్థానం ఈవో ఎల్ రమాదేవి తెలిపారు. శుక్రవారం స్థానిక చిత్రకూట మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ.. మార్చి 25 నుంచి శ్రీరామ నవమి, పట్టాభిషేకానికి సంబంధించిన పలు సెక్టార్ల టిక్కెట్లను భక్తులకు ఆన్‌లైన్‌లో ఉంచామన్నారు. అలాగే వేడుకలకు ప్రత్యక్షంగా రాలేని భక్తులకోసం ఏర్పాట్లు చేశామని, అందుకు సంబంధించిన టిక్కెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఉగాది రోజున శ్రీరామనవమి నవాహ్నిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్నామని, ఉదయం ఉగాది పచ్చడి ప్రసాద వితరణ, 9గంటలకు ఉత్సవారంభం, ఋత్విక్ వరణం, రక్షాబంధనం, స్నపన తిరుమంజనం, సాయంత్రం పుట్టమన్నుతో పూజ, స్వామివారికి తిరువీధి సేవను కల్పవృక్ష వాహనంపై జరుపుతామని తెలిపారు. సాయంత్రం పంచాంగ శ్రవణం ఉంటుందన్నారు. 16వ తేదీ వరకు పలు కార్యక్రమాలు జరుగుతాయని 17న శ్రీరామ నవమి ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12:30వరకు స్వామివారి తిరుకళ్యాణం, సాయంత్రం పునర్వసు దీక్షాప్రారంభం ఉంటుందన్నారు. 18న ఉదయం మిథిగాలా ప్రాంగణంలో మహా పట్టాభిషేకం ఉంటుందన్నారు. భక్తుల కోసం 2.5లక్షల లడ్డూలు, ఐదు లక్షల ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు పాడిచేటి సీతారామానుజాచార్యులు, ఈఈ రవీందర్ రాజు, ఏఈవోలు శ్రావణ్‌కుమార్, భవాని రామకృష్ణ, వేద పండితులు ఎస్టీజీ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

కార్యకర్తలే బీఆర్ఎస్‌కు గుండెకాయ

- అందరమూ కలిసి పనిచేద్దాం.. ఎన్నికల్లో విజయం సాధిద్దాం..
- ఖమ్మంలో బీఆర్ఎస్‌ను గెలిపించి అధినేత కేసీఆర్‌కు గిఫ్ట్ ఇద్దాం..
- వైరా ముఖ్య నేతల సమావేశంలో ఎంపీలు నామా, వద్దిరాజు

మాట్లాడుతున్న ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, చిత్రంలో వద్దిరాజు, తాతా మధు

వైరా టౌన్, ఏప్రిల్ 5: కార్యకర్తలే పార్టీకి గుండెకాయ లాంటి వారని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. అందరమూ కలిసికట్టుగా పనిచేసి ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. వైరాలో శుక్రవారం జరిగిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు కష్టపడి పనిచేయడం వల్లనే నాయకులుగా తాము ఎన్నో పదవులు అనుభవిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ మాయమాటలు నమ్మి మోసపోయిన ప్రజల్లో మార్పు కన్పిస్తోందని అన్నారు. అందుకు ప్రతిగా బీఆర్ఎస్ మళ్లీ ఆదరించేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో ఏకీభవించి పనిచేద్దామని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కూడా పార్లమెంటు ఎన్నికల విజయం నాంది కావాలని అన్నారు. ప్రజలు కూడా వాస్తవాలను గ్రహిస్తున్నారని, ఈ లోక్‌సభ ఎన్నికల్లో కేసీఆర్‌కు మద్దతుగా నిలిచేందుకు ఎదురుచూస్తున్నారని అన్నారు. తెలంగాణ వాణిని పార్లమెంటులో వినిపించాలంటే తప్పనిసరిగా బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. బీజేపీ, కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎంపీలు ఏనాడూ పార్లమెంటులో ప్రజల పక్షాన నోరు విప్పలేదని విమర్శించారు. తెలంగాణ బిల్లు పెట్టినప్పుడు మొదటి ఓటు తానే వేశానని గుర్తుచేశారు.

కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దాం: వద్దిరాజు, మధు

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును గెలిపించి పార్టీ అధినేత కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దామని పిలుపునిచ్చారు. నామా గెలుపు కోసం ప్రతి ఒక్కరమూ కంకణబద్ధులమై పనిచేద్దామని అన్నారు. మాజీ ఎమ్మెల్యేలు మదన్‌లాల్, రాములునాయక్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు క్షేత్రస్థాయిలో బలమైన క్యాడర్ ఉందని, దానిబలంతోనే విజయం సాధిస్తామని అన్నారు. అనంతరం బాబూజగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. బీఆర్ఎస్ నేతలు కొండబాల కోటేశ్వరరావు, బాణాల వెంకటేశ్వరరావు, సీతారాములు, లాల్‌మహ్మద్, రవి, విశ్వేశ్వరరావు, జీవన్, మాదినేని సునీత, కాపా మురళీకృష్ణ, నంబూరి కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

నీటిచౌర్యం జరగనీయొద్దు

- ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి రానీయొద్దు
- తాగునీటి సరఫరా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్
- కలెక్టర్‌తో కలిసి పాలేరులో సాగర్ ఇన్‌ఫ్లో పరిశీలన

పాలేరు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న జిల్లా తాగునీటి సరఫరా స్పెషల్ ఆఫీసర్ సురేంద్రమోహన్, కలెక్టర్ గౌతమ్, ఇరిగేషన్ సీఈ విద్యాసాగర్, మిషన్ భగరథ సీఈ శ్రీనివాస్

కూసుమంచి, ఏప్రిల్ 5: పాలేరు రిజర్వాయర్ పరిధిలో ఎక్కడా నీటి చౌర్యం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తాగునీటి సరఫరా జిల్లా స్పెషల్ ఆఫీసర్ సురేంద్రమోహన్ సూచించారు. పోలీస్, ఇరిగేషన్, మిషన్ భగీరథ శాఖల అధికారుల పర్యవేక్షణలో నీటి సరఫరా జరగాలని ఆదేశించారు. ఈ వేసవిలో ఐదు జిల్లాకు తాగునీటిని అందించే పాలేరు నీరు ఎక్కడా వృథాకాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వీపీ గౌతమ్‌తో కలిసి కూసుమంచి మండలంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. పాలేరు రిజర్వాయర్‌ను, సాగర్ నుంచి వచ్చే ఇన్‌ఫ్లోను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్, మిషన్ భగీరథ సీఈలు విద్యాసాగర్, శ్రీనివాస్‌లతో మాట్లాడారు. అధికారులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే, పాలేరు నీటిమట్టం ఇంకా ఎన్నిరోజులు నీరు వస్తుంది? రోజుకు ఎన్ని నీళ్లు వినియోగమవుతాయి? పరిసర గ్రామాల పరిస్థితులు, పాలేరు నీటిపై ఆధారపడిన గ్రామాల పరిస్థితుల గురించి వాకబు చేశారు. వీటిల్లో ఎక్కడైనా నీటిచౌర్యం జరుగుతుందా? అని ఇరిగేషన్ అధికారులను అడిగారు. అనంతరం నాయకన్‌గూడెం వద్ద గల ఇన్‌ఫాల్ కాలువను పరిశీలించి.. పాలేరుకు రావాల్సిన 5,200 క్యూసెక్కు నీళ్లు ఎన్ని రోజుల్లో వస్తాయని ఈఈలు విద్యాసాగర్, మంగలపుడి వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం సాయంత్రానికి పాలేరు 13 అడుగులకు చేరుతుందని, ఆదివారం దాకా సాగర్ నుంచి నీటిని విడుదల చేస్తారని, ఆ తరువాత మరో నాలుగు రోజులపాటు కూడా ఇన్‌ఫ్లో ఉంటుందని సమాధానమిచ్చారు. సాగర్ నీళ్లు ఇదే తరహాలో వస్తే పాలేరు నీటిమట్టం 18 నుంచి 20 అడుగుల వరకు పెరిగే అవకాశం ఉందని వివరించారు.

పాలేరు నీళ్లు ఐదు జిల్లాలకు ఆధారం: కలెక్టర్

వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వీపీ గౌతమ్ సంబంధిత అధికారులకు సూచించారు. పాలేరు నీళ్లు ఐదు జిల్లాల ప్రజలకు ఆధారమైనందున ఎక్కడా నీటి ట్యాంపరింగ్ జరగకుండా చర్యలు పర్యవేక్షించాలని ఆదేశించారు.

రంగుల బిడ్జి ఎస్కేప్ పరిశీలన..

సూర్యాపేట, ఖమ్మం జిల్లాల సరిహద్దు నాయకన్‌గూడెం సమీపంలోని రంగుల బ్రిడ్జి ఎస్కేప్‌ను కలెక్టర్ గౌతమ్, ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారులు పరిశీలించారు. అక్కడి నుంచి నీటిని దిగువకు విడుదల చేసుకునే అవకాశం ఉన్నందున ఇక్కడ నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, ట్రైనీ కలెక్టర్లు మాయాంక్‌సింగ్, యువరాజ్, వివిధ శాఖల అధికారులు గణేశ్, విద్యాసాగర్, శ్రీనివాస్, మంగలపుడి అనన్య, వాణిశ్రీ, పుష్పలత, మురళీకృష్ణ, రత్నకుమారి, సురేశ్‌కుమార్, వేణుగోపాల్‌రెడ్డి, జనార్దన్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పతనమవుతున్న ఎర్రబంగారం ధర

- పద్దెనిమిది వేల దిగువకు గరిష్ఠం
- మార్కెట్‌కు పంటను తీసుకొచ్చేందుకు రైతుల అనాసక్తి
- జెండాపాటలో క్వింటాల్ ధర రూ.18,700

మిర్చియార్డుకు రైతులు తీసుకువచ్చిన మిర్చి బస్తాలు (ఫైల్)

ఖమ్మం వ్యవసాయం, ఏప్రిల్ 5 : సీజన్ ఆరంభంలో మెరుపులు మెరిపించిన తేజారకం మిర్చి ధర ముగింపు సమయానికి ముఖం చాటేస్తున్నది. దీంతో నేటివరకు పంటను ఇండ్లలో నిల్వ చేసుకున్న రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. గత సంవత్సరం డిసెంబర్ నుంచి ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు పొరుగుజిల్లాల నుంచి రైతులు కొత్తరకం పంటను తీసుకరావడం ప్రారంభించారు. ఈ సమయంలో క్వింటాల్ కొత్తపంట ధర రూ.22 వేలు పలికింది. ఇదే అదునుగా భావించిన రైతులు చేలల్లో పంటను తీసిన వెంటనే మార్కెట్‌కు తీసుకరావడం ప్రారంభించారు. అయితే మరి కొంతమంది రైతులు పంట చివరాకరవరకు మరింత ధర పెరుగుతుందని ఆశించారు. గత పక్షంరోజుల నుంచి నగర వ్యవసాయ మార్కెట్లో ఊహించని విధంగా ధరలు తగ్గడం ప్రారంభమైంది. పంట నాణ్యత ప్రమాణాలు తగ్గడం ఒకవైపు కాగా, నాణ్యత తక్కువ ఉన్న పంటను కొనుగోలు చేసే చైనా కంపెనీల ఫ్యాక్టరీలు లోకల్ పంటను కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనపరచడం లేదు. నేరుగా కర్ణాటక నుంచి మిర్చి పంటను దిగుమతి చేసుకోవడం సైతం పంట ధర తగ్గుదలకు కారణం అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. బుధవారం ఉదయం జెండాపాట సమయానికి వివిధ జిల్లాల నుంచి రైతులు 20వేల మిర్చి బస్తాలను తీసుకొచ్చారు. జెండాపాటలో గరిష్ఠ ధర క్వింటాల్ 18,700 పలికింది, మధ్య ధర క్వింటాల్ రూ.16,500 కాగా, కనిష్ఠ ధర రూ.11 వేల చొప్పున ఖరీదుదారులు పంటను కొనుగోలు చేశారు. తాలురకం పంట గరిష్ఠ ధర క్వింటాల్ రూ.10 వేలు కాగా, కనిష్ఠ ధర క్వింటాల్ రూ.7,700 చొప్పున వ్యాపారులు పంటను కొనుగోలు చేశారు. రోజురోజుకు మార్కెట్లో ధర తగ్గుతుండడంతో పంటను యార్డుకు తీసుకొచ్చేందుకు రైతులు ఆసక్తి కనపరచడం లేదు. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకునేందుకు ఆసక్తి కనపరుస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా ఈవీఎంల తరలింపు : కలెక్టర్ గౌతమ్

ఈవీఎంల తరలింపును పరిశీలిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, ఏప్రిల్ 5 : ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికలకు ఈవీఎంల మొదటి విడత ర్యాండమైజేషన్ చేపట్టిన అనంతరం నియోజకవర్గాల వారీగా ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు రవాణాకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ. గౌతమ్ తెలిపారు. శుక్రవారం నూతన కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోడౌన్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరిచి, ఈవీఎంల ఆన్‌లైన్ ర్యాండమైజేషన్‌లో కేటాయించబడిన విధంగా ఆయా కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్లను సెగ్మెంట్ల వారీగా వేరు చేసి, ఆయా స్ట్రాంగ్ రూమ్‌లకు భద్రత నడుమ రవాణాకు చర్యలు చేపడతామన్నారు. ఖమ్మం, పాలేరు సెగ్మెంట్లకు సంబంధించి ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాల, వైరాకు వైరా సాంఘీక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల,కళాశాల, మధిరకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, సత్తుపల్లికు జ్యోతి విద్యాలయంలో స్ట్రాంగ్ రూంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్‌నాయక్, జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం.రాజేశ్వరి, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, మదన్ గోపాల్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, బీజేపీ ప్రతినిధి జీఎస్ఆర్ఏ. విద్యాసాగర్, సీపీఐ(ఎం) ప్రతినిధి ఆర్. ప్రకాశ్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఎన్.సత్యంబాబు, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి చీకటి రాంబాబు, టీడీపీ ప్రతినిధులు పాలడుగు టీఆర్. కృష్ణప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

పరిగెత్తించి.. పొట్టనపెట్టుకున్నారు

- ఫైనాన్స్ వాళ్ల నుంచి తప్పించుకోవాలని.. చెరువులోకి దూకిన యూపీ కార్మికుడు
- ఈత రాకపోవడంతో మృతి

మృతిచెందిన యూపీ కార్మికుడు, వినయ్ (ఫైల్)

రఘునాథపాలెం, ఏప్రిల్ 5 : ఫైనాన్స్ వ్యాపారుల నుంచి తప్పించుకోవాలని ఓ ఉత్తరప్రదేశ్ కార్మికుడు చెరువులోకి దూకి మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం ఖమ్మం నగర పరిధి జయనగర్‌కాలనీకి ఆనుకొని ఉన్న ఖానాపురం చెరువు వద్ద చోటుచేసుకుంది. ఖానాపురం హవేలీ పోలీసులు తెలిపిన ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఆగ్రా సమీపంలోని అయ్యేలాకు చెందిన వినయ్(21) బతుకుదెరువు కోసం ఖమ్మం వచ్చి దానవాయిగూడెంలో నివాసం ఉంటున్నాడు. మార్బుల్స్ పనులు నిర్వహించే వినయ్, తన మేస్త్రి అజయ్ ఠాగూర్ కలిసి ఖమ్మం నగరానికి చెందిన మోహన్‌సాయి ఫైనాన్స్‌లో ద్విచక్ర వాహనాలకు ఫైనాన్స్‌ను తీసుకున్నారు. కాగా వినయ్ వాహనంపై రూ.4 వేలు, మేస్త్రి అజయ్‌ఠాగూర్ వాహనంపై రూ.14 వేలు పెండింగ్ ఉన్నాయి. అయితే వినయ్ వాహనాన్ని ఫైనాన్స్ రికవరీ ఏజెంట్లు రామచందర్, అజయ్ కుమార్ నాలుగురోజుల క్రితమే స్వాధీనపర్చుకున్నారు. మేస్త్రి అజయ్‌ఠాగూర్ ఫైనాన్స్ పెండింగ్ ఉండడంతో శుక్రవారం జయనగర్ కాలనీలో పనులు నిర్వహిస్తున్న వినయ్‌ను మేస్త్రి వాహనం విషయమై నిలదీశారు. దీనిపై ఇరువురికి వాగ్వాదం జరగడంతో వినయ్ తప్పించుకునేందుకు పరుగుతీశాడు. అయితే సదరు వసూళ్లకు వచ్చిన రికవరీ ఏజెంట్లు డీ రాంచందర్, అజయ్‌కుమార్ వినయ్‌ను ద్విచక్రవాహనంతో వెంబడించారు. పరిగెత్తుకుంటూ ఖానాపురం చెరువువైపుగా వచ్చిన వినయ్ తప్పించుకోవాలని అందులోకి దూకాడు. అప్పటికే సొక్కిపోయిన వినయ్ చెరువులో మునిగిపోయాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని అన్నం సేవా బృందం సభ్యుల సహాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. చెరువులోకి దూకిన వినయ్ మునిగి చనిపోయినట్లుగా గుర్తించి వసూళ్లకు వచ్చిన రికవరీ ఏజెంట్లు అక్కడి నుంచి ఉడాయించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సంతోశ్ తెలిపారు.